సాక్షి
మంచిర్యాల
ఆదివారం । 21 । మే । 2023



ఆర్టీసీపై ఎండల ప్రభావం
ఎండల ప్రభావం ఆర్టీసీ ఆదాయంపై పడుతోంది. వడగాల్పుల కారణంగా ప్రయాణికులు వెనుకంజ వేస్తున్నారు. మరోవైపు ఉద్యోగులు అనారోగ్యం బారిన పడుతున్నారు. 8లో▸



స్విమ్మింగ్ సందడి 9లో▸
వేసవి సెలవులు కావడంతో విద్యార్థులు ఈత నేర్చుకోవడంపై ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో పట్టణంలోని స్విమ్మింగ్ పూల్‌లలో సందడి కనిపిస్తోంది. బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఇస్తున్నారు.

గరిష్టం/కనిష్టం
41.0 /27.0

వాతావరణం
ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

ఐటీ.. బెల్లంపల్లికి దివిటీ..!

సండే స్పెషల్

బెల్లంపల్లి: పుట్టి పెరిగిన.. విద్యాబుద్ధులు నేర్పిన ఊరిని మరువలేదు. ఉజ్వలమైన భవిష్యత్ కోసం విదేశాలకు వెళ్లాలని ఉవ్విళ్లూరలేదు. సొంత ఊరిలోనే సాఫ్ట్‌వేర్ కంపెనీలను స్థాపించి నిరుద్యోగులకు ఆశాదీపమయ్యారు. నల్లబంగారం నేలలో ఐటీ మాణిక్యాలను తయారు చేస్తున్నారు. బెల్లంపల్లిలో రెండు ఐటీ కంపెనీలు ఉండగా.. ఒక కంపెనీని బెల్లంపల్లికి చెందిన అన్నదమ్ములు ఎర్ర శ్రీరంగనాథరాజు, ఎర్ర శ్రీనాథరాజు, ఎర్ర సాయినాథరాజు, మరో కంపెనీని చెన్న మాధవుని వెంకటరమణ సమర్థవంతంగా నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

- స్థానికులకు ఉద్యోగావకాశాలు
- కంపెనీలను సందర్శించిన కేటీఆర్



ఐటీ కంపెనీలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు

పరిశీలించిన కేటీఆర్

ఈ నెల 8న బెల్లంపల్లిలో పర్యటించిన మంత్రి కేటీఆర్ ఇక్కడ నిర్వహిస్తున్న కంపెనీలను సందర్శించారు. నిర్వాహకులు, ఉద్యోగులతో మాట్లాడి నిర్వహణ తీరు పరిశీలించారు. అనంతరం సభలో మాట్లాడుతూ యువతకు శిక్షణ ఇచ్చేందుకు స్కిల్ డెవలప్‌మెంటు సెంటర్‌ను బెల్లంపల్లికి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.



ఐటీ ఉద్యోగులతో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్(ఫైల్)

ఉన్నత ఉద్యోగాలు వదిలి..

బెల్లంపల్లి పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ఎర్ర శ్రీధర్‌రాజు, శ్రీదేవి దంపతులకు కుమారులు శ్రీరంగనాథరాజు, శ్రీనాథరాజు, సాయినాథరాజు ఉన్నారు. ఎంబీఏ అభ్యసించిన అన్నదమ్ములు అంతర్జాతీయంగా ప్రఖ్యాతిగాంచిన సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉన్నత శ్రేణి ఉద్యోగాల్లో చేరారు. శ్రీరంగనాథ్ టీవీఎస్ గ్రూప్‌లో చీఫ్ ఎకనామిస్ట్, శ్రీనాథరాజు కోవినెంట్ ఐటీ రిక్రూట్‌మెంట్ కంపెనీలో హైదరాబాద్ హెడ్‌గా, సాయినాథరాజు సిగ్నిటీ జెన్‌క్యూ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంటర్నేషనల్ బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ బాధ్యతలు నిర్వర్తించారు. ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నా సొంతంగా ఏదైనా సాధించాలనే తపన బలంగా నాటుకుపోయింది. ఆ ఆలోచనల నుంచి 'సనాతన' ఎనలెటిక్స్, రిక్రూట్‌మెంట్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ అనే కంపెనీని తాము పుట్టి పెరిగిన బెల్లంపల్లిలో 2017లో స్థాపించారు. సవాళ్లను ఎదుర్కొంటూ సమర్థవంతంగా రాణిస్తున్నారు. వారి సతీమణులు హారిక, కీర్తన, సాహితి కూడా ఐటీ కంపెనీ నిర్వహణలో తమ వంతు పాత్ర పోషిస్తున్నారు.

ఐదు వేల మందికి ఉపాధి లక్ష్యం..

సనాతన ఎనలెటిక్స్, రిక్రూట్‌మెంటు సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ ద్వారా హెచ్2హెచ్, ఎకనామిక్ రీసెర్చ్, షాప్స్ అండ్ మీ నిర్వహిస్తున్నారు. హెచ్2హెచ్ సంస్థ ద్వారా ఎంఎన్‌సీలకు సేవలందిస్తూ ఏడీపీ, సర్వీస్ నౌ, ఎస్‌అండ్‌పీ క్యాపిటల్ ఐక్యూ, టావెంట్, ఐహెచ్‌ఎస్ తదితర కంపెనీలతో భాగస్వామ్యం అయ్యారు. ఎకనామిక్ రీసెర్చ్ ద్వారా సీయామ్, టీవీఎస్ గ్రూపు ఇతర ప్రఖ్యాతిగాంచిన ఆటోమొబైల్ కంపెనీలకు బిజినెస్ డెవలప్‌మెంటు రీసెర్చ్ నిర్వహిస్తున్నారు.

- స్మాల్ బాస్కెట్ రిటెయిల్ ఈ కామర్స్ సంస్థను ఏర్పాటు చేసి బెల్లంపల్లి కేంద్రంగా 15కిలోమీటర్ల పరిధిలో షాప్స్ అండ్ మీ అనే మొబైల్ యాప్ ద్వారా హోండెలివరి సర్వీసులు కొనసాగిస్తున్నారు. ఆయా విభాగాల్లో వంద మంది పని చేస్తుండగా వీరిలో 83మంది స్థానికులు, 17మంది స్థానికేతరులు ఉన్నారు. వీరి హోదాను బట్టి కనిష్టం రూ.20వేల నుంచి గరిష్టంగా 1.80 లక్షల వరకు జీతాలు చెల్లిస్తున్నారు. ఐదు వేల మందికి ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

వాల్యూ పిచ్ ఈ టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్

చెన్న మాధవుని వెంకటరమణ బెల్లంపల్లిలోని శాంతిఖని బస్తీ నివాసి. అతడి తండ్రి శ్రీరాములు సింగరేణిలో ఎస్‌ఈగా పని చేసి ఉద్యోగ విరమణ పొందారు. తల్లి పద్మజ గృహిణి. పదో తరగతి వరకు బెల్లంపల్లిలోనే చదివి ఇతర ప్రాంతాల్లో ఉన్నత విద్యాభ్యాసాన్ని కొనసాగించి ఐసీడబ్ల్యూఏఐ పూర్తి చేశారు. కొంతకాలం ఓ కంపెనీలో పని చేసి 2006లో సొంతంగా వాల్యూ పిచ్ ఈ టెక్నాలజీస్ ప్రై.లిమిటెడ్ అనే సాఫ్ట్‌వేర్ కంపెనీ ముంబయి కేంద్రంగా ఏర్పాటు చేశాడు. వేలాది మందికి ఉద్యోగాలు కల్పించాడు. కరోనా సమయంలో వెంకటరమణ ఓసారి ఇక్కడికి రాగా మిత్రులు, సన్నిహితుల ద్వారా స్థానిక స్థితిగతులు తెలుసుకుని 2020లో కంపెనీని స్థాపించాడు. విస్తరణలో భాగంగా వీపీ ఆగ్రో, వెరిఫై 24ఇన్‌టు7, బీటుబీ టెస్టర్స్, ట్యాగ్స్ 24 ఇన్‌టు 7 వంటి సంస్థలకు రూపకల్పన చేశాడు. ఆయా విభాగాల్లో 200 మందికి ఉద్యోగావకాశాలు కల్పించాడు. రూ.20వేల నుంచి రూ.90వేల వరకు హోదాల వారీగా వేతనాలు పొందుతున్నారు. మరో 800 మందికి ఉద్యోగావకాశాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు.

ఉద్యోగావకాశాల కల్పనే లక్ష్యం



పుట్టిన ఊరిలో ఐటీ కంపెనీ స్థాపించి క్రమంగా విస్తరించాలనే తలంపులో ఉన్నాం. ఇక్కడ నైపుణ్యత కలిగిన విద్యావంతులు ఉన్నారు. ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాల కల్పనే లక్ష్యంగా ప్రయత్నాలు చేస్తున్నాం. మా ఊరిలో మేము ఐటీ కంపెనీని స్థాపించి నిరుద్యోగులకు ఉద్యోగం ఇవ్వడం ఆనందంగా ఉంది.

– శ్రీరంగనాథరాజు, సనాతన సీఈఓ, బెల్లంపల్లి

ఉద్యోగాల్లో స్థానికులకే పెద్దపీట



బొగ్గుగనుల పుట్టినిల్లు బెల్లంపల్లిలో ఉద్యోగాలు లేక నిరుద్యోగుల వేదన బాధనిపించింది. ముంబయిలో మాదిరిగానే స్థానికంగా కూడా ఐటీ కంపెనీని స్థాపించాలని పట్టుదలతో ప్రయత్నించాను. మొండిధైర్యంతో ముందడుగు వేసి 200 మందికి ఉద్యోగాలు ఇవ్వడం ఆనందం కలిగించింది. సాధారణ పట్టణమైన బెల్లంపల్లిలో సైతం ఐటీ కంపెనీలు నడుస్తాయనే భరోసా వచ్చింది. ముున్ముందు మరింత మందికి ఉద్యోగాలు కల్పిస్తాను. ఉద్యోగాల్లో స్థానికులకే పెద్ద పీట వేస్తాను.

– చెన్న మాధవుని వెంకటరమణ, సీఈవో, వాల్యూ పిచ్ ఈ టెక్నాలజీస్, బెల్లంపల్లి

ఎంసీహెచ్‌కు సమస్యల సుస్తీ..!



ప్రహరీ నిర్మించకపోవడంతో ఆస్పత్రి ఆవరణలో పశువుల సంచారం



ఓపి వద్ద వరండాలో ఫ్యాన్లు లేక ఉక్కపోత



ప్రసవం వార్డులో ఇంటి నుంచి తెచ్చిన కూలర్లు

- ప్రారంభించి ఏడాది దాటినా అవే తిప్పలు
- ఐసీయూల్లో ఏసీలు లేవు, ఓపీ వద్ద ఫ్యాన్లు లేవు
- గైనకాలజిస్టుల కొరత

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్డు గోదావరి నది ఒడ్డున మాతాశిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)ను సమస్యలు వెంటాడుతున్నాయి. రూ.1.70 కోట్లతో నిర్మించగా.. గత ఏడాది మార్చిలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు ప్రారంభించారు. గత ఏడాది మేలో వైద్య సేవలు ప్రారంభమయ్యాయి. సరిగ్గా నెల రోజులకే భారీ వర్షాలకు ఎంసీహెచ్ నీట మునిగింది. దీంతో ఎంసీహెచ్‌ను తిరిగి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఎంసీహెచ్‌లో వైద్య సేవలు పునఃప్రారంభించారు. ఆస్పత్రి భవనం వరకు వెళ్లేందుకు రూ.1.98కోట్లతో సీసీ రోడ్డు, మధ్యలో సెంట్రల్ లైటింగ్, పార్కింగ్ పనులు ప్రారంభించినా.. రోడ్డు పనులు మాత్రమే పూర్తి చేశారు. ప్రహరీకి రూ.70లక్షలు కేటాయించినా పనులు పూర్తి కాలేదు. దీంతో ఆవరణలో పశువులు సంచరిస్తున్నాయి. రవాణా సౌకర్యం లేకపోవడంతో మొదట్లో ఆర్టీసీ బస్సు నడిపినా కొద్దిరోజుల వరకే పరిమితమైంది. తప్పనిసరి పరిస్థితుల్లో గర్భిణులు ఆటోలు, ద్విచక్ర వాహనాలపై వస్తున్నారు. వాహనాలకు నీడ లేకపోవడంతో ఎండలోనే నిలపాల్సి వస్తోంది.

ఫ్యాన్లు, ఏసీలు లేక ఉక్కపోత

ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య భారీగా పెరుగుతున్నా అందుకు తగిన సదుపాయాల కల్పనలో విఫలం అవుతున్నారు. నెలలో 350కి పైగా ప్రసవాలు జరుగుతుండగా.. ఐసీయూలో గత ఏడాది ఏర్పాటు చేసిన ఏసీలు వరద నీటిలో మునిగి పాడయ్యాయి. అందులో సగం చోరీకి గురయ్యాయి. ప్రస్తుతం ఏసీలు లేకుండానే ఫ్యాన్లతో ఐసీయూను నిర్వహిస్తున్నారు. నదికి సమీపంలో ఉండడం, కాళేశ్వరం, ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటి నిల్వతో తీవ్ర ఉక్కపోతతో గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. వరండాల్లోనూ ఫ్యాన్లు లేక డాక్టర్ కన్సల్టేషన్, స్కానింగ్ పూర్తయ్యే వరకు చేతిలో ఉన్న ఫైళ్లతో గాలి విసురుకోవాల్సి వస్తోంది. స్కానింగ్‌కు ఇద్దరు రేడియాలజిస్టులు ఉన్నారు. ఉదయం తొమ్మిది గంటలకే ఓపీ వైద్య సేవలు ప్రారంభం అవుతున్నాయి. కానీ స్కానింగ్ మాత్రం మధ్యాహ్నం 12గంటల తర్వాతనే చేస్తున్నారు. దీంతో గర్భిణులు వరండాలోనే గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. రేడియాలజిస్టుల్లో ఒకరికి ప్రైవేటు స్కానింగ్ సెంటర్ ఉండడం వల్లనే ఆలస్యంగా వచ్చి స్కానింగ్ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రసవం వార్డులో ఫ్యాన్లు ఉన్నా అధిక ఉష్ణోగ్రతలతో ఉక్కపోత ఎక్కువై ఇంటి నుంచి కూలర్లను తెచ్చుకుంటున్నారు.

వైద్యుల కొరత

మాతాశిశు ఆరోగ్య కేంద్రానికి మంచిర్యాల, కుమురంభీం జిల్లాలతోపాటు మహారాష్ట్ర నుంచి ప్రజలు వస్తుంటారు. ప్రతీరోజు 15 నుంచి 20 వరకు ప్రసవాలు జరుగుతుండగా, 150 మంది ఓపీలో చెకప్ కోసం వస్తుంటారు. ఎనిమిది మంది గైనకాలజిస్టులు ఉండాల్సి ఉన్నా ప్రస్తుతం ఇద్దరే పనిచేస్తున్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి కేటాయించిన ఐదుగురు సీనియర్ రెసిడెంట్లు ఉన్నా వివిధ కారణాలతో నలుగురు సెలవులోనే ఉంటున్నారు. మొత్తం ముగ్గురు వైద్యులతోనే వైద్య సేవలు అందిస్తున్నారు. వైద్యుల కొరత కారణంగా ప్రసవం కోసం వచ్చే వారికి పూర్తిస్థాయిలో వైద్యం అందడం లేదు. ఉన్న వైద్యులపైనే అదనపు భారం పడుతోంది. వైద్యులు, సిబ్బందిని నియమించాలని, ఉక్కపోత నివారణకు చర్యలు తీసుకోవాలని గర్భిణులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం



మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో గత ఏడాది ఏసీలు అమర్చి ఫ్యాన్లు బిగించాం. వరదలు, దొంగలు ఎత్తుకెళ్లడం వల్ల ప్రస్తుతం ఏసీలు లేని పరిస్థితి. ప్రస్తుతం 13 ఏసీలు అవసరం కాగా, ఆరింటికి అనుమతి వచ్చింది. 20 ఫ్యాన్లు ఇవ్వాలని అడిగాం, అనుమతి రావాల్సి ఉంది. వస్తే ఓపీ, స్కానింగ్ వద్ద వాటిని ఏర్పాటు చేస్తాం. ఈ నెల 22 తర్వాత నలుగురు గైనకాలజిస్టులు వచ్చే అవకాశం ఉంది. మరో ఇద్దరిని నియమించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. గోదావరి నది ఒడ్డున ఉండడం వల్ల ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. పలువురు ఇంటి నుంచి కూలర్లను తీసుకుని వస్తున్నారు.

– డాక్టర్ హరిశ్చందర్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్


న్యూస్‌రీల్

పారిశుధ్య పనుల తనిఖీ



కాసిపేట: ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా మండలంలోని ముత్యంపల్లి, కాసిపేట, లంబాడితండా(కె), గ్రామ పంచాయతీలను జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు శనివారం తనిఖీ చేశారు. పారిశుధ్య పనులు పరిశీలించారు. చెత్తను కంపోస్టు షెడ్డుకు తరలించాలని, పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు. అందరూ కలిసికట్టుగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పల్లెప్రకృతి వనం, వైకుంఠధామం, కంపోస్టు షెడ్డులు పరిశీలించారు. ముత్యంపల్లి గ్రామంలో నిబంధనలు పాటించని దుకాణాలకు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. ఎంపీవో నాగరాజు, సర్పంచ్ ఆడె బాదు, ఉపసర్పంచ్‌లు తిరుపతి, సుమన్, కార్యదర్శులు మేఘన, సురేష్, సౌందర్య పాల్గొన్నారు.

నెలాఖరులోగా బడి పనులు పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న డీఈఓ యాదయ్య

బెల్లంపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు –మన బడి పథకంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య ఆదేశించారు. శనివారం బెల్లంపల్లి హన్మాన్ బస్తీలో ఉన్న శ్రీవెంకటేశ్వర టైలర్స్ సొసైటీ కేంద్రం, బజారు ఏరియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల సందర్శించి అభివృద్ధి పనులు, విద్యార్థుల యూనిఫామ్స్‌ను పరిశీలించారు. డీఈఓ మాట్లాడుతూ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అన్నారు. యూనిఫామ్స్‌ను పాఠశాలలు తెరిచేలోగా అందించాలని ఆదేశాలు జారీ చేశారు. డీఈఓ వెంట సెక్టోరల్ అధికారి చౌదరి, ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు అజయ్‌కుమార్, శంకర్‌గౌడ్ ఉన్నారు.

నకిలీకి అడ్డుకట్ట పడేనా..?



గత నెల 30న కన్నెపల్లి మండలంలో పట్టుబడిన పత్తివిత్తనాలు

- నిషేధిత పత్తి విత్తనాల విక్రయాలు
- అరికట్టేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ టీం ఏర్పాటు
- ఏటా బడా వ్యాపారుల దందా
- విత్తన సరఫరా ఏజెంట్లుగా గ్రామాల్లో నేతలు

మంచిర్యాలఅగ్రికల్చర్: నిషేధిత పత్తి విత్తనాలు, నకిలీ విత్తనాల నివారణకు సర్కారు చర్యలు ముమ్మరం చేసింది. నకిలీ విత్తనాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని, ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వ్యవసాయ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో అక్రమార్కులపై ఉక్కుపాదం మోపాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఈ నెల 16న జరిగిన సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నకిలీ విత్తనాలు రైతులకు చేరకుండా వానాకాలం సాగుకు ముందే చర్యలు చేపట్టాలని, ఆయా దుకాణాలు, గోదాములపై టాస్క్‌ఫోర్స్‌తో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే కలెక్టర్ వ్యవసాయ అధికారులు, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించారు. జిల్లాలో కొంతకాలంగా బీజీ–3 పత్తి విత్తనాల సరఫరా సాగుతోంది. ఈ విత్తన సాగులో కలుపు నియంత్రణకు ఉపయోగించే గ్లైఫోసెట్ గడ్డి నివారణ మందు వినియోగమూ పెరిగిపోతోంది. దీనివల్ల పర్యావరణం, భూసారం దెబ్బతినడంతోపాటు రైతుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. ప్రభుత్వాలు విత్తనాలు, కలుపు మందుల వినియోగాన్ని నిషేధించాయి. అయినా బీజీ–3 రైతులకు చేరకుండా అడ్డుకట్ట పడడం లేదు. గ్రామాల్లో పలుకుబడి కలిగిన బడా నాయకులు ఈ విత్తనాల సరఫరా ఏజెంట్లుగా అవతరించడమే అందుకు కారణంగా తెలుస్తోంది. నిషేధిత విత్తనాలు విక్రయించిన వారిపై పీడీ యాక్టు వంటి కఠినమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నా దందా ఆగడం లేదు. పట్టుబడిన సమయంలో కింది స్థాయి వారిపై కేసులు నమోదు చేస్తూ వదిలేస్తున్నారు. విత్తనాలు ఎక్కడి నుంచి వచ్చాయి, పెద్దమొత్తంలో ఎవరు సరఫరా చేశారు, దీని వెనుక సూత్రధారులు ఎవరు అనే వాటిపై విచారణ జరగడం లేదనే విమర్శలున్నాయి. అధికారుల అండదండలూ ఉంటున్నాయనే ఆరోపణలూ వస్తున్నాయి.

ఏటా కేసుల నమోదు

గత రెండేళ్లుగా జిల్లాలో నిఘా వ్యవస్థ పహారా కాస్తున్నా, విత్తనాలు పట్టుబడుతున్నా బీజీ–3 సాగు విస్తరించి సవాల్ విసురుతోంది. దీంతో దళారులదే పై చేయి అవుతోంది. ఈ ఏడాది సీజన్ ఆరంభానికి ముందే ఇప్పటికే మూడు చోట్ల విత్తనాలు పట్టుబడ్డాయి.

అధికంగా ఈ మండలాల్లోనే..

జిల్లాలో 18 మండలాల్లో రైతులు పత్తి సాగు చేస్తున్నారు. కొన్నేళ్లుగా పత్తి సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. గత ఏడాది 1.60లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. ఈ ఏడాది సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది. 30శాతం మంది రైతులు గుర్తింపు లేని విత్తనాలు సాగు చేస్తున్నారు. వానాకాలం సీజన్‌లో అధికంగా తాండూర్, భీమిని, కన్నెపెల్లి, నెన్నెల, బెల్లంపల్లి, మందమర్రి మండలాల్లో నిషేధిత విత్తనాల విక్రయాలు సాగుతున్నాయి. ఏటా సీజన్‌కు ముందు నుంచే విత్తనాలు రైతులకు చేరవేస్తున్నారు. కలుపు మొక్కల నివారణకు వినియోగించే గ్లైఫోసెట్ గడ్డి మందు తట్టుకునే సామర్థ్యం ఉండడంతో సాగు చేస్తున్నారు. ఆశాజనకంగా దిగుబడి, కలుపు నివారణలో కూలీల ఖర్చు, కొరతను అధిగమించేందుకు రైతులు కొనుగోలు చేస్తున్నారు. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని కొందరు విత్తనాలు విక్రయిస్తూ రూ.కోట్లు దండుకుంటున్నారు. ఈ విత్తనాలు సాగు చేసిన రైతులు దిగుబడి రాక నష్టపోతే దళారులు చేతులెత్తేస్తున్నారు.

జిల్లాలో పత్తి సాగు అధికం..
దళారుల పంట పండుతోంది..

రైతుల అవసరాలను ఆసరా చేసుకుని కొందరు దళారులు నిషేధిత విత్తనాలు విక్రయిస్తున్నారు. వానాకాలం సీజన్ ఆరంభానికి ముందే ఫిబ్రవరి నుంచి విత్తనాలు గ్రామాలకు చేరవేసి ఇళ్ల, వరిగడ్డి కుప్పల్లో, మామిడితోటల్లో నిల్వ చేస్తున్నారు. ఎకరానికి కిలో నుంచి రెండు కిలోల విత్తనాలు అవసరం కాగా.. కిలో రూ.2,200 నుంచి రూ.2,500 వరకు విక్రయిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి కిలో రూ.800 నుంచి రూ.1,200కు కొనుగోలు చేసి రెట్టింపు ధరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.

జిల్లాలో గత ఐదేళ్లలో విత్తనాలు పట్టుబడిన కేసులు

సంవత్సరం	కేసులు
2918	20
2019	19
2020	17
2021	42(వీరిలో ఆరుగురిపై పీడీ యాక్టు)
2022	4

అవగాహన కల్పిస్తున్నాం..



నిషేధిత పత్తి విత్తనాలు సాగు చేయకూడదని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. పెద్ద మొత్తంలో సాగు చేస్తున్న రైతులకు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి విత్తనం సాగు వల్ల కలిగే నష్టాలు, ఇబ్బందులు, కాదు కూడదని సాగు చేస్తే తీసుకునే చర్యలపై అవగాహన కల్పిస్తాం. విత్తనాల అమ్మకాలు సాగకుండా ప్రత్యేక వ్యవస్థ ఉంది. పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా బృందాలు ఏర్పాటు చేస్తాం. ఎవరైనా విత్తనాలు అమ్ముతున్నట్లు సమాచారం అందిస్తే పట్టుకుని కేసులు నమోదు చేస్తాం.

– కల్పన, జిల్లా వ్యవసాయ అధికారి

రైస్‌మిల్లుల్లో ఆకస్మిక తనిఖీ

లక్సెట్టిపేట: మండలంలోని రైస్‌మిల్లులను జి ల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ శని వారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశా రు. రైతుల ధాన్యాన్ని తీసుకవచ్చిన లారీలను అన్‌లోడింగ్‌లో జాప్యంపై అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధా న్యాన్ని అన్‌లోడ్ చేసుకోవాలని మిల్లర్లకు సూ చించారు. మిల్లర్లకు కేటాయించిన లక్ష్యాలను నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలన్నారు. రైతులకు ట్రక్ రశీదును వెంటనే ఇవ్వాలని, రై తులకు బ్యాంకులో డబ్బులు త్వరగా చేరుతా యని తెలిపారు. అనంతరం మిల్లుల వద్ద ఉన్న లారీలు, ధాన్యం బస్తాలను పరిశీలించారు.

11వ వేతన ఒప్పందం కొలిక్కి



ఒప్పందంపై సంతకాలు చేస్తున్న సంఘాల నేతలు

శ్రీరాంపూర్: బొగ్గు గని కార్మికుల 11వ వేతన ఒప్పందం కొలిక్కి వచ్చింది. రెండ్రోజులుగా కోల్‌కత్తాలో జేబీసీసీఐ–11 వేజ్‌బోర్డు చర్చలు జరిగాయి. శుక్రవారం అలవెన్స్‌లపై చర్చించి నిర్ణయాలకు వచ్చారు. ప్రస్తుతం ఉన్న అన్ని అలవెన్స్‌లపై 25 శాతం పెంచడానికి అంగీకారం కుదిరింది. ఈ మేరకు శనివారం జరిగిన చర్చల్లో యాజమాన్యం ఎంఓయూ తయారు చేసి చర్చల్లో పెట్టింది. కోలిండియా చైర్మన్ ప్రమోద్ అగర్వాల్, కోలిండియా సబ్సిడరీ కంపెనీల సీఎండీలు, సింగరేణి నుంచి డైరెక్టర్(ఫైనాన్స్) ఎన్.బలరాం, జీఎం కుమార్‌రెడ్డి, ఐదు జాతీయ సంఘాల నుంచి 36 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ ఎంఓయూపై కోలిండియా యాజమాన్యం, ఐదు జాతీయ సంఘాల నేతలు సంతకాలు చేయడంతో ఒప్పందం పూర్తయ్యిందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి, వేజ్‌బోర్డు సభ్యుడు వీ.సీతారామయ్య తెలిపారు. ఏరియర్స్‌ను కూడా త్వరగా చెల్లించాలని కోలిండియా చైర్మన్‌ను కోరినట్లు తెలిపారు. ఈ ఒప్పందం ప్రకారం దేశ వ్యాప్తంగా మిగతా పబ్లిక్ సెక్టార్‌లోని వారి వేతన ఒప్పందాల కంటే ఇది మెరుగైందని తెలిపారు. ఇది కార్మికుల విజయమని బీఎంఎస్ వేజ్‌బోర్డు సభ్యుడు కే.లక్ష్మారెడ్డి తెలిపారు.

తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తదానం

బెల్లంపల్లి: జిల్లాలోని తలసేమియా వ్యాధిగ్రస్తులకు సకాలంలో రక్తం అందించేందుకు రక్తదానం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అన్నారు. శనివారం బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రిలో తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిబిరాల్లో సేకరించిన రక్తాన్ని రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా తలసేమియా వ్యాధిగ్రస్తులకు ఉపయోగిస్తామని ప్రకటించారు. అనంతరం 52మంది రక్తదాతలకు ప్రశంసపత్రాలు అందజేశారు. తహసీల్దార్ మధుసూదన్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్యామలదేవి, డెప్యూటీ తహసీల్దార్ మానిక్ రావు, రెడ్ క్రాస్ సొసైటీ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్, సభ్యుడు లక్ష్మీనారాయణ, వైద్యులు అలేఖ్య, ఏరియా ఆసుపత్రి సీఎంఓ శౌరి, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పనివేళలు మార్చాలని సీఎండీకి లేఖ

శ్రీరాంపూర్(మంచిర్యాల): మండుతున్న ఎండలకు సింగరేణి కార్మికులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి ఓసీపీల్లో పనివేళలు మార్చాలని కంపెనీ సీఎండీకి శనివారం లేఖ రాసినట్లు గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ అధ్యక్షుడు బీ.వెంకట్రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొన్నిరోజులుగా అధిక ఉష్ణోగ్రతలతో కార్మికులు పనిచేయడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, ఓసీపీల్లో మొదటి షిఫ్ట్ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, రెండో షిఫ్ట్ సాయంత్రం 4 నుంచి 11 గంటల వరకు ఏర్పాటు చేయాలని కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రామునిచెరువులో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై తహసినొద్దీన్ తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు చెరువువద్దకు వెళ్లి పరిశీలించగా మృతుని వయస్సు సుమారు 35 సంవత్సరాలు ఉంటాయని, ఒంటిపై బట్టలులేవని, శరీరం పూర్తిగా కుళ్లిపోయి ఉందన్నారు. సుమారు ఐదు రోజుల క్రిత్రం మృతి చెందినట్లుగా ఉందన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.


పల్లె దవాఖానా పనితీరు పర్యవేక్షణ



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని గఢ్పూర్‌లో ఏర్పాటు చేసిన పల్లె దవాఖానాలోని పనితీరును శనివారం మంచిర్యాల డివిజన్ వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సీహెచ్ఓ రామ్మూర్తి, సబ్ యూనిట్ అధికారి నాందేవ్ రిజిస్టర్లు పరిశీలించి సూచనలు చేశారు. పల్లె దవాఖానా ద్వారా గ్రామంలో 8 మంది మహిళలు కు.ని ఆపరేషన్ చేయించుకునేలా కృషి చేసిన సిబ్బందిని ప్రశంసించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సుధాకర్, ఏఎస్ఎం ఆదిలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నీ శుభఘడియలే..



- నేటినుంచి జూన్ 14 వరకు ముహూర్తాలు

దండేపల్లి(మంచిర్యాల): పెళ్లంటే నూరేళ్ల పంట.. అంతే కాదు.. విభిన్న వృత్తుల వారికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించే క్రతువు. మే, జూన్ మాసాల్లో ఎక్కువగా మంచి ముహూర్తాలుంటాయి. గృహ ప్రవేశాలు, ఇతర శుభకార్యాలు చేసుకునేవారు ఈ శుభసమయాల్లో ముహూర్తాలు కుదుర్చుకుంటారు. జూన్18 నుంచి ఆగస్టు18 వరకు మౌఢ్యమి కారణంగా వివాహాలు, శుభకార్యాలు నిర్వహించరాదు. ఈ నెల 21, 22, 24, 25, 27, 28, 31 తేదీలతో పాటు జూన్ 1, 2, 3, 5, 7, 8, 10, 12, 14 తేదీల్లో శుభముహూర్తాలున్నాయి. దీంతో వివాహాలు, శుభకార్యాలు చేసేవారు ముందుగానే ముహూర్తపు తేదీలు ఖరారు చేసుకుంటున్నారు.



ముందస్తు బుకింగ్‌లే..

మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా ఇదివరకే వివాహాలకు ముహూర్తాలు ఖరారు చేసుకున్న వారంతా తమ తేదీలకు తగ్గట్టుగా ఫంక్షన్‌హాళ్లను ముందస్తుగా బుక్ చేసుకుంటున్నారు. ఫొటో, వీడియో గ్రాఫర్లు, పురోహితులకు కూడా అడ్వాన్స్‌లు చెల్లిస్తున్నారు. వంట మనుషులను కూడా ముందే మాట్లాడి పెట్టుకుంటున్నారు. జిల్లాలో ఫంక్షన్‌హాళ్ల కొరత ఉండడంతో ఇవి దొరకనివారు ఇండ్ల వద్ద మైదాన ప్రాంతాల్లో వివాహాలు జరిపించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

చాలా మందికి ఉపాధి

వరుస ముహూర్తాలతో వివాహాది శుభకార్యాలపై ఆధారపడి ఉపాధి పొందేవారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. టెంట్‌హౌస్, డెకరేషన్, బ్యాండ్, క్యాటరింగ్, ఫొటో, వీడియో గ్రాఫర్లు, వివిధ రంగాల వారు ఈ 25 రోజుల పాటు బిజీగా ఉంటారు.

జూన్ 14వరకే ముహూర్తాలు



ఈ నెల 21 నుంచి జూన్ 14 వరకు వరుస ముహూర్తాలున్నాయి. జూన్ 18 నుంచి ఆగస్టు 18 వరకు మౌఢ్యమి ఉన్నందువల్ల ఈ సమయంలో శుభకార్యాలు చేయరాదు. మే, జూన్‌లో ఉన్న 25 రోజుల వరుస శుభముహూర్తాలను వివాహాలు, ఇతర శుభకార్యాలు నిర్వహించుకునేవారు వినియోగించుకోవడం మంచిది.

– బ్రహ్మశ్రీ గొల్లపెల్లి రామానందచార్యస్వామి, వేదపండితుడు, ఇటిక్యాల

ఆర్టీసీపై ఎండల ప్రభావం

- ప్రయాణానికి జంకుతున్న ప్రజలు
- రోజురోజుకు తగ్గుతున్న ఆదాయం
- అనారోగ్యం బారిన కార్మికులు

మంచిర్యాల ఆర్టీసీ డిపో ఆదాయం ఇలా..

తేదీ	ఆదాయం(రూ.ల్లో)
14	29,55,147
15	30,64,472
16	26,34,501
17	26,81,710
18	25,57,028
19	22,77,775



మంచిర్యాల ఆర్టీసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడు

మంచిర్యాలఅర్బన్: రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ఆర్టీసీపై ప్రభావం చూపుతున్నాయి. మండుతున్న ఎండలు.. వడగాల్పుల భగభగలతో ప్రయాణికులు ఉక్కిరి బిక్కిరి అవుతుండడంతో ప్రయాణం వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఖాళీ సీట్లతోనే బస్సులు తిరుగుతుండడంతో ఆర్టీసీకి ఆదాయం తగ్గి నష్టాల్లోకి వెడుతోంది. మంచిర్యాల ఆర్టీసీ డిపోలో 145 బస్సులు వివిధ రూట్లలో తిరుగుతున్నాయి. రోజుకు రూ.32 లక్షలు ఆదాయం రావాల్సి ఉండగా ప్రస్తుతం రూ.25 లక్షలకు చేరింది. మునుపెన్నడూలేని విధంగా మంచిర్యాల డిపో ఆదాయంలో వెనుకబడి పోతోంది.

అనారోగ్యం బారిన కార్మికులు

రోజురోజుకూ భానుడు తన ప్రతాపం చూపుతుండడంతో విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ కార్మికులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఒకవైపు ఎండల తీవ్రత.. మరోవైపు బస్సు ఇంజన్ వేడితో డ్రైవర్లు నరకయాతన పడుతున్నారు. గంటల తరబడి బస్సుల్లోనే ఉండాల్సి వస్తుండడంతో కండక్టర్లు, డ్రైవర్లు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎండలోనే విధులు నిర్వహిస్తుండడంత వల్ల జ్వరం, వాంతులు, విరేచనాలు, నీరసం, కళ్లు తిరిగి పడిపోవడం, కాళ్లు లాగడం, తదితర లక్షణాలతో ఆర్టీసీ వైద్యశాలకు పరుగులు తీస్తున్నారు. ఇలాంటి లక్షణాలతో రోజుకు 6 నుంచి పదిమంది వైపు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మరోవైపు అధికారులు డబుల్ డ్యూటీలతో తిప్పలు పెడుతున్నారని కార్మికులు వాపోతున్నారు. పనిగంటలు పెంచి డ్యూటీ వేయటం వల్ల బ్యాక్‌పెయిన్, తదితర రోగాల బారినపడి పది నుంచి పదిహేను రోజుల వరకు సిక్‌లీవులు పెట్టిన వారున్నారు. ఆర్టీసీ డిపోలో మధ్యాహ్నం అంబలి పంపిణీ చేస్తుండడం కార్మికులకు ఉపశమనం కలిగిస్తోంది.

జాగ్రత్తలు పాటించాలి

రోజురోజుకు ఎండలు పెరుగుతున్నాయి. కొబ్బరిబోండం, ఓఆర్ఎస్‌తో కలిపిన నీరు తీసుకుంటే మంచింది. నీళ్లు ఎక్కువగా తాగాలి. సమయానికి ఆహారం తీసుకోవాలి. హోటల్, ఇతరత్రా బయట ఆహారం తీసుకుంటే వాంతులు, విరేచనాల బారిన పడే అవకాశాలున్నాయి. తలకు తెల్లటి క్లాత్, మాస్కులు, టోపీలు ధరించాలి.

– పరంజ్యోతి, వైద్యుడు, ఆర్టీసీ ఆస్పత్రి, మంచిర్యాల

దర్జాగా విద్యుత్ చౌర్యం!



ఐడిల్ లైన్‌కు కొండీలు వేసిన దృశ్యం



ఐడిల్ లైన్‌కు కొండీలు వేసిన దృశ్యం

- గ్రామ ట్రాన్స్‌ఫార్మర్‌కు కొండీలు తగిలించి కరంటు వాడకం
- ప్రమాదవశాత్తు కార్మికుడికి విద్యుత్ షాక్

వేమనపల్లి(బెల్లంపల్లి): కోట్లాది రూపాయలు వెచ్చించి వంతెన నిర్మిస్తున్న కాంట్రాక్టర్ విద్యుత్ సౌకర్యంకోసం అడ్డదారి తొక్కాడు. ముల్కలపేట గ్రామ అవసరాలకు ఉపయోగించే ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిరుపయోగంగా ఉన్న విద్యుత్‌లైన్‌కు కొండీలు తగిలించి విద్యుత్ చౌర్యానికి పాల్పడ్డాడు. ఫలితంగా నిర్మాణపనుల్లో ఉన్న కార్మికుడు విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. వివరాల్లోకి వెళ్తే... వేమనపల్లి మండలంలోని ముల్కలపేట, రాచర్ల గ్రామాల మధ్య సుమారు రూ.10 కోట్ల వ్యయంతో ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన(పీఎంజీఎస్‌వై) ప్యాకేజీ కింద రెండు హైలెవల్ వంతెనలు నిర్మిస్తున్నారు. అక్కడ కాంట్రాక్ట్ సిబ్బంది క్యాంపు కూడా ఏర్పాటు చేశారు. రాడ్ కట్టింగ్, ఇతర అవసరాలకు విద్యుత్ తప్పనిసరి. ఇందుకు గుత్తేదారు ట్రాన్స్‌కోకు దరఖాస్తు చేసుకుని డీడీ కట్టి వారి అనుమతితో ట్రాన్స్‌ఫార్మర్, మీటర్ ఏర్పాటు చేసుకోవాలి. కానీ అవేం పట్టించుకోకుండా విద్యుత్ చౌర్యానికి ఒడిగట్టారు.

కరంటు తీగలకు కొండీలు తగిలించి..

వంతెన నిర్మాణ పనుల వద్ద నిరుపయోగంగా ఉన్న ఐడిల్ విద్యుత్ లైన్‌పై గుత్తేదారు కన్నేశాడు. ఈ లైన్ గతంలో కోటపల్లి మండలం జనగామ, అలుగామ ఎత్తిపోతల పథకం కోసం నీల్వాయి సబ్‌స్టేషన్ నుంచి సుమారు 10 కిలోమీటర్ల విద్యుత్ లైన్ నిర్మించారు. నిరుపయోగంగా ఉన్న ఈ ఐడిల్ లైన్‌కు ముల్కలపేట వాటర్ ట్యాంకు వద్ద గ్రామ అవసరాల కోసం అమర్చి ఉన్న 15 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌కు అనుమతి లేకుండా కొండీలు తగిలించారు. అక్కడి నుండి సుమారు 2 కిలోమీటర్ల దూరం విద్యుత్ సరఫరా ఇచ్చి నిర్మాణ పనులకు వాడుకుంటున్నారు. వంతెన వద్ద కార్మికులు పని చేస్తుండగా బుధవారం చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమ జిల్లాకు చెందిన బబ్లు అనే కార్మికుడు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. విషయం బయటికి రాకుండా మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఇంత జరుగుతున్న ట్రాన్స్‌కో అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ దీపక్‌ను వివరణ కోరగా విద్యుత్ షాక్ ఘటన జరిగింది నిజమేనన్నారు. అక్రమంగా విద్యుత్ వాడుతున్నారన్న విషయం తెలియదంటూనే గంటల వ్యవధిలో ముల్కలపేటకు వెళ్లి కొండీలు తగిలించి ఉన్న చోట తీగలను తొలగించారు. వంతెన పనుల వద్ద విద్యుత్ స్తంభానికి సైడ్ ఆరమ్ బిగించారు.

ప్రియురాలు మోసం చేసిందని..

- యువ కార్మికుడు బలవన్మరణం
- రెండు నెలల క్రితమే సింగరేణి ఉద్యోగం
- శ్రీరాంపూర్‌లో ఘటన



ప్రణయ్(ఫైల్)

శ్రీరాంపూర్(మంచిర్యాల): వారిద్దరూ ప్రేమించుకున్నారు. కలిసి తిరిగారు.. తమ ప్రేమను పెళ్లి వరకు తీసుకెళ్లాలని అనుకున్నారు. తండ్రి సింగరేణి ఉద్యోగం కూడా వచ్చే అవకాశం ఉండడంతో పెళ్లి తర్వాత ఎలా స్థిరపడాలో కలలు కన్నారు. కానీ, ఇంతలో ఏమైందో ఏమో ప్రియురాలు మరో వ్యక్తిని పెళ్లి చేసుకుంది. ఉద్యోగంలో జాయిన్ కాగానే పెళ్లికి ప్లాన్ చేసుకోగా, ఇంతలోనే ప్రేయసి మోసం చేయడంతో అతను తట్టుకోలేకపోయాడు. రెండు నెలల క్రితం సింగరేణి కార్మికుడిగా విధుల్లో చేరినా.. వెంటాడుతున్న ప్రేయసి జ్ఞాపకాలతో మనస్తాపం చెందాడు. ఆమె లేని జీవితం తనకు వద్దనుకున్నాడు. శుక్రవారం రాత్రి తన గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద సంఘటన నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాంపూర్‌లో జరిగింది. శ్రీరాంపూర్ ఎస్సై రాజేశ్, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గణేశ్‌నగర్‌కు చెందిన చిప్పకుర్తి చంద్రయ్య, పోశమ్మ దంపతులకు తిరుపతి, ప్రణయ్ ఇద్దరు సంతానం. సింగరేణి కార్మికుడిగా పనిచేస్తున్న చంద్రయ్య ఇటీవలే మెడికల్ ఇన్వ్యాలిడేషన్ అయ్యాడు. తన ఉద్యోగాన్ని కారుణ్య నియామకం కింద కుమారుడు ప్రణయ్(23)కు ఇచ్చాడు.

జాబ్ వస్తే సెటిల్ అవుదామని..

బెల్లంపల్లికి చెందిన యువతిని కొంత కాలంగా ప్రేమిస్తున్న ప్రణయ్ తండ్రి ఉద్యోగం తనకు రాగానే లైఫ్ సెట్ అవుతుందని భావించాడు. ఈమేరకు సింగరేణి శిక్షణ కూడా పూర్తి చేసుకున్నాడు. ఇంతలో ప్రియురాలు మనసు మార్చుకుంది. కారణం చెప్పకుండానే మరో యువకుడిని పెళ్లి చేసుకుంది. దీంతో ప్రణయ్ మనస్తాపం చెందాడు. కానీ, అతని తల్లిదండ్రులు, స్నేహితులు ధైర్యం చెప్పారు. జాబ్ వచ్చాక.. మరో అమ్మయితో ఘనంగా పెళ్లి చేస్తామని నచ్చజెప్పారు.

రెండు నెలల క్రితం ఉద్యోగం..

ఈ క్రమంలో రెండు నెలల క్రితం ప్రణయ్ సింగరేణి ఉద్యోగంలో చేరాడు. ఎస్సార్పీ 3, 3ఏ గనిలో బదిలీవర్కర్‌గా పనిచేస్తున్నాడు. అయితే ప్రియురాలిని మాత్రం మర్చిపోలేకపోయాడు. ఆమె జ్ఞాపకాలు తరచూ వెంటాడుతుండడంతో ఆమె చేసిన మోసాని తలచుకుని మదనపడేవాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుని తండ్రి చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

‘ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలి’



అదనపు కలెక్టర్ మధుసూదన్‌కు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

పాతమంచిర్యాల: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ, భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) జిల్లా కార్యదర్శి రేగుంట చంద్రకళ శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడాకారులకు రక్షణ ఇవ్వలేని కేంద్ర ప్రభుత్వం సాధారణ మహిళలకు ఎలాంటి రక్షణ కల్పిస్తుందో తెలిసిపోతుందన్నారు. బెంజర్ల ఉమ, అచ్చే విజయ, మంజుల, బాకం విజయ పాల్గొన్నారు.

కాపురానికి తీసుకెళ్లడం లేదని ఆత్మహత్య



శారద(ఫైల్)

శ్రీరాంపూర్(మంచిర్యాల): భర్త కాపురానికి తీసుకెళ్లడం లేదని భార్య ఆత్మహత్య చేసుకున్న ఆర్కే 6 హట్స్ కాలనీలో చోటు చేసుకుంది. ఎస్సై రాజేశ్ తెలిపిన వివరాల కాలనీకి చెందిన గోపు సారయ్య కూతురు శారద(32)కు దండేపల్లి మండలంలోని నంబాలకు చెందిన పెట్టం రామకృష్ణతో ఆరేళ్ల క్రితం వివాహమైంది. దంపతులకు నాలుగేళ్ల కూతురు ఉంది. కూతురు పుట్టినప్పటి నుంచి భర్త కాపురానికి తీసుకెళ్లడం లేదు. దీంతో మనస్థాపం చెందిన మహిళ శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఇంటి పైకప్పుకు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. శనివారం ఉదయం తలుపులు తీయకపోవడంతో స్థానికులు వెళ్లి చూడగా ఉరేసుకుని కనిపించింది. వెంటనే కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి సోదరుడు సురేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గోదావరిలో దూకి వృద్ధుడు..

లక్సెట్టిపేట(మంచిర్యాల): గోదావరిలో దూకి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని బీట్‌బజార్‌కు చెందిన కొత్త కాంతయ్య(75) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స చేయించినా నయం కాకపోవడంతో మనస్థాపానికి గురయ్యాడు. శనివారం స్థానిక గోదావరినదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పాముకాటుతో విద్యార్థిని మృతి

- సకాలంలో స్పందించని 108 సిబ్బంది



భారతి(ఫైల్)

భీమారం(చెన్నూర్): ఇంట్లో టీవీ చూస్తుండగా పాముకాటుకు గురైన దుర్గం భారతి (15) అనే విద్యార్థిని సకాలంలో వైద్యం అందకపోవడంతో మృతి చెందిన ఘటన మంచిర్యాల జిల్లా భీమారం మండలం కొత్తపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన దుర్గం బాపు, శంకరమ్మ దంపతుల కూతురు భారతి భీమారంలోని కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుతోంది. వేసవి సెలవులకు స్వగ్రామం కొత్తపల్లికి వచ్చింది. శుక్రవారం రాత్రి ఇంట్లో చాపపై పడుకుని టీవీ చూస్తుండగా మోచేతి వద్ద పాము కాటు వేసింది. సర్పంచ్ గోదరి తిరుపతి 108కు సమాచారం అందించేందుకు గంటపాటు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో 100కు ఫోన్ చేశారు. పోలీసుల సాయంతో లైన్‌లోకి వచ్చిన 108 సిబ్బంది అప్పటికే ఆలస్యమైందని, వెంటనే ప్రైవేట్ వాహనంలో తీసుకురావాలని సూచించారు. కారులో మంచిర్యాలకు తీసుకెళ్తుండగా ఇందారం క్రాస్‌రోడ్డు వద్ద 108 ఎదురైంది. వెంటనే అందులో ఎక్కించి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. 108 సిబ్బంది సకాలంలో స్పందిస్తే విద్యార్థిని బతికేదని సర్పంచ్ తిరుపతి అన్నారు.

కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్ ప్రవేశాలు

మంచిర్యాలటౌన్: ఇటీవల పదోతరగతి ఫలితాల్లో 7 గ్రేడ్, ఆపైన మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, దివ్యాంగులు, మైనార్టీ విద్యార్థులు కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్‌లో ప్రవేశానికి ఆన్‌లైన ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి పి.రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పాస్ వెబ్‌సైట్ https://telanganaepass. cgg. gov. in ద్వారా ఈ నెల 22 నుంచి జూన్ 3వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

‘అనుమానితులు కనిపిస్తే సమాచారమివ్వాలి’

కోటపల్లి: గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ విద్యాసాగర్ అన్నారు. శనివారం మండలంలోని వెంచపల్లి, జనగామ, అలుగామ ప్రాణహిత సరిహద్దు ప్రాంతాలతో పాటు ప్రాణహిత ఫెర్రి పాయింట్స్‌ను సందర్శించి తనిఖీలు నిర్వహించారు. పడవల యజమానులు, సరిహద్దు ప్రాంతాల గుండా వచ్చిపోయే వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాణహిత నది తీర ప్రాంతాల్లో తునికాకు కల్లం వద్దకు వెళ్లి సమాచారం అడిగి తెలుసుకున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి సమస్యలున్నా పోలీసుల దృష్టికి తీసుకరావాలని సూచించారు.

రగ్బీ జిల్లా జట్ల ఎంపిక పోటీలు

శ్రీరాంపూర్(మంచిర్యాల): రగ్బీ జిల్లా జట్ల ఎంపిక పోటీలను శనివారం నస్పూర్‌లోని సాధన గ్రీన్ కిడ్స్ ప్లేస్కూల్‌లో నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు కొండ చంద్రశేఖర్ పోటీలను ప్రారంభించారు. ఎంపికైన జట్లు ఈ నెల 22 నుంచి 24 వరకు హైదరాబాద్‌లోని మర్రి లక్ష్మారెడ్డి ఇనిస్టిట్యూట్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆవునూరి మహేశ్, పాఠశాల కరస్పాండెంట్ శ్రీధర్, పీ ఈటీలు రాజలింగు, రాజశేఖర్, రవీందర్ పాల్గొన్నారు.

‘బీసీలను విస్మరించిన పార్టీలకు గుణపాఠం’

పాతమంచిర్యాల: బీసీలను విస్మరించిన పార్టీలకు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీసీలకు 65 అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీల జనాభా 56 శాతం, ఓట్ల శాతం 54.75 ఉందన్నారు. రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి రావాలన్నా బీసీల ఓట్లతోనే సాధ్యం అన్న విషయాన్ని అన్ని రాజకీయ పార్టీలు గుర్తుంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా మూడు ప్రధాన రాజకీయ పార్టీలకు లేఖలు రాసారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కోకన్వీనర్ సంగం లక్ష్మణ్, మహేంద్ర సంఘం జిల్లా అధ్యక్షుడు నూరినేని కిషన్, యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శి గడ్డం సతీష్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అఖిల్ పాల్గొన్నారు.

‘అవకతవకలపై విచారణ జరపాలి’

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యకళాశాలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగ నియామకాల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు నల్ల నాగేంద్రప్రసాద్, నయీంపాషా కలెక్టరేట్‌లో ఏవో సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1:3 నిష్పత్తిలో ఇంటర్వ్యూ నిర్వహించి అర్హులను ఎంపిక చేయాల్సి ఉండగా రాజకీయ పలుకుబడి, డబ్బులు ఇచ్చిన వారికే ఉద్యోగం ఇచ్చారన్నారు.